# క్రైం కౌంటర్

webisite:www.crimecounter.in

ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం

తెలుగు దిన పత్రిక

సంపుటి : 02 సంచిక : 137 ప్రకాశం, సోమవారం 16- 02 - 2026 పేజీలు : 4 వెల. 2 /-



రిపోర్టర్లు కావలెను

క్రైం కౌంటర్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో

- జిల్లా బ్యూరోలు
- జిల్లా ఇన్‌చార్జీలు
- నియోజక వర్గ ఇన్‌చార్జీలు

కావలెను.

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

98497 07349


## శ్రీ భ్రమరాంబ రామలింగేశ్వర స్వామి దర్శనం ఎమ్మెల్యే ఇంటూరి



**వలేటివారిపాలెం క్రైం కౌంటర్ ప్రతినిధి పోకూరి మాల్యాద్రి,** మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఎం ఎల్ ఏ ఇంటూరి నాగేశ్వరరావు వలేటివారిపాలెం పంచాయతీలోని శ్రీ భ్రమరాంబ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ వేద పండితులు ఆయన స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు వేద పండితుల మంత్రోచ్చారణలతో పాటు ఆలయ అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయనమాట్లాడుతూ మహాశివరాత్రి సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. బోలా శంకరుని ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.

అన్నదాన కార్యక్రమంలో ఆయన భక్తులతో కలిసి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ వలేటివారిపాలెం మండల అధ్యక్షులు మాదాల లక్ష్మీనరసింహం, గ్రామ పార్టీ అధ్యక్షుడు కాకుమాని ఆంజనేయులు, పార్టీ నాయకులు గుత్తా మహేశ్వరరావు, వలేటి నరసింహం, కాకుమాని హర్ష, పరిటాల భాస్కర్, వలేటి మధు, గుత్తా తిరపతయ్య, కొంకా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మహాశివరాత్రి వేడుకలు



**క్రైం కౌంటర్ ప్రతినిధి టి నాగ బ్రహ్మం కందుకూరు రూరల్,** కందుకూర్ డివిజన్ పరిధిలో ఉన్న పలు ప్రాంతాలు, పట్టణంలోని శ్రీ స్కందపురిసోమేశ్వరాలయము, కనిగిరి రోడ్ లో ఉన్న శ్రీ మల్లేశ్వర స్వామి ఆలయము, శ్రీ మార్కండేశ్వర స్వామి ఆలయము ,పడమటి బలిజ పాలెం ఉన్న పడమటి ముఖ ఏకాంబరేశ్వర స్వామి ఆలయం, తదితర ప్రాంతాలలో మహా శివరాత్రి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. మహా శివరాత్రి పండుగ సంద్భంగా ఆలయంలోని మహా శివ లింగంనకు అభిషేకం నిర్వహించి స్వామి వారిని పూలతో సుందరంగా అలంకరించారు. తెలవరుజమునిచే భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వారిని దర్శిచుకొని స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అన్నదాన వితరణ కార్యక్రమం లో న్యూ లైఫ్ , హరిణి , తులసి , లీల , ప్రణవి హాస్పిటల్స్ డాక్టర్స్ టీ. మల్లికార్జున , కె.అనిల్ కుమార్, కె. నవీన్ కుమార్, మధుసూధన్ రాజు , తిరుమలరావు పాల్గొని భక్తులకు అన్నదాన వితరణ అందిచ్చారు. సాయంత్రం పలు సాంస్కతిక కార్యక్రమాలు కొలాట్టం, పాట కచేరీ , డాన్స్ ప్రోగ్రామ్స్ ని నిర్వహించారు. లింగోద్భవ సందర్భం లో స్వామి వారికి జలాభిషేకం చేపట్టారు. భక్తుల శివ నామసమరణతో ఆలయం మారుమోగింది. భక్తులకు ఏటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆలయ నిర్వాహకులు దారం రమణయ్య , దారం మాల్యాద్రి తెలియజేశారు.

# విజయవంతంగా మెగా మెడికల్ క్యాంపు..

## రెండోరోజు సేవలను ప్రశంసించిన సబ్ కలెక్టర్, ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరిండెంట్




**క్రైమ్ కౌంటర్ న్యూస్....మార్కాపురం జిల్లా....** పెద్ద దోర్నాల: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా నడకదారిలో దోర్నాల నుంచి శ్రీశైలం వైపు ప్రయాణించే శివభక్తుల ఆరోగ్య రక్షణ కోసం నావవ్రాష్ణుతీమ్ఘ మరియు ఏలూరి లక్ష్మీదేవి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పెద్దదోర్నాలలో ఏర్పాటు చేసిన ఉచిత మెడికల్ క్యాంపు విజయవంతంగా కొనసాగుతోంది. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి సేవాస్ఫూర్తితో, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ పీవీఎన్ మాధవ్ నాయకత్వంలో ఈ సేవా కార్యక్రమం నిర్వహించబడుతోంది. ఈ మెడికల్ క్యాంపు రెండో రోజు సందర్భంగా మార్కాపురం సబ్ కలెక్టర్ ఎం. శివరామిరెడ్డి, ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ దాసరి బాలయ్య క్యాంపును సందర్శించారు. భక్తులకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించిన వారు, ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ సేవా కార్యక్రమాన్ని అభినందించారు. శివభక్తుల ఆరోగ్య పరిరక్షణ కోసం ముందుండి సేవలందించడం అభినందనీయమని వారు పేర్కొన్నారు. రెండో రోజు మెడికల్ క్యాంపులో భాగంగా మార్కాపురానికి చెందిన ప్రముఖ వైయస్సార్సీపి కౌన్సిలర్ వైద్యులు డాక్టర్ చెప్పల్లి కనకదుర్గ, కందుల ఓబుల్ రెడ్డి ఆసుపత్రి వైద్య సిబ్బంది పాల్గొని భక్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు అందజేశారు. భక్తులకు ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యుడు, బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ, మహాశివరాత్రి సందర్భంగా శ్రీశైలం వెళ్లే శివభక్తుల సేవే పరమోన్నతమైన సేవ అని తెలిపారు. భక్తులు ప్రయాణంలో ఎలాంటి అనారోగ్య సమస్యలకు గురికాకుండా ఉండేందుకు ఈ మెడికల్ క్యాంపును ఏర్పాటు చేశామని చెప్పారు. భక్తులకు అవసరమైన అన్ని రకాల వైద్య సేవలు, ఉచిత మందులు అందుబాటులో ఉంచినట్లు ఆయన వివరించారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తూ సమాజ సేవకు ట్రస్ట్ కట్టుబడి ఉంటుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, బీజేపీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, సేవా కార్యకర్తలు పాల్గొన్నారు.....

# సురక్షిత ప్రయాణం..డ్రైవర్‌కు ఏదీ?

**క్రైం కౌంటర్ న్యూస్ , ఫిబ్రవరి 15** ప్రయాణికుల ప్రాణాలు డ్రైవర్ చేతిలో ఉంటాయి. మరి డ్రైవర్ ప్రాణాలకే ముప్పు ఏర్పడితే?.. సురక్షిత ప్రయాణానికి భరోసా ఇస్తోన్న ఏపీఎ?సఆర్టీసీలో ఇప్పుడు డ్రైవర్ల ప్రాణాలకు భరోసా లేకుండా పోయింది. బస్సు నడుపుతున్న సమయంలోనే గుండెపోటు రావడంతో డ్రైవర్లు స్టీరింగ్‌పై వాలిపోతున్నారు. ప్రయాణికుల్ని భద్రంగా గమ్యానికి చేర్చాల్సిన రథసారథులే మార్గ మధ్యలో లోకాన్ని వీడి వెళ్లి పోతున్నారు. ప్రయాణికుల వెన్నులో వణుకు, డ్రైవర్ల కుటుంబాల్లో కన్నీరు పెట్టిస్తున్న ఈ సమస్య ఆర్టీసీకి పెను సవాలుగా మారింది. ఏటా 250 నుంచి 350 మంది చొప్పున గత మూడేళ్లలో 910 మంది డ్రైవర్లు గుండెపోటుతో ప్రాణాలు కోల్పోయారు.

డ్రైవర్లకు వైద్య పరీక్షలు ఏవీ?

ప్రతి రోజూ లక్షల ప్రయాణికుల్ని గమ్య స్థానాలకు చేర్చే ఆర్టీసీ డ్రైవర్ల ఆరోగ్యం.. ఆ ఉద్యోగి సంక్షేమం మాత్రమే కాదు.. ప్రజల భద్రతకు సంబంధించినది. ప్రైవేటుతో పోలిస్తే ఆర్టీసీ కొంతమేర సురక్షితమేనని ప్రజలు కూడా విశ్వసిస్తున్నారు. డ్రైవర్లు స్టీరింగ్‌పై వాలిపోయి ప్రాణాలు కోల్పోతున్నా ప్రయాణికుల్ని మాత్రం రక్షిస్తూనే ఉన్నారు. ప్రతి సారీ, ప్రతి డ్రైవర్ ఇలా కాపాడటం సాధ్యమేనా? అనే ప్రశ్న తలెత్తుతోంది. రవాణా, కార్మిక భద్రతా నిబంధనల ప్రకారం వాణిజ్య వాహనాలు నడిపే డ్రైవర్లకు నిర్దిష్ట వ్యవధిలో వైద్య పరీక్షలు చేయాలి. కంటి చూపు, వినికిడి, శారీరక, మానసిక సమస్యలతోపాటు గుండె ఆరోగ్యాన్ని పరీక్షించి వైద్యుల నివేదిక ప్రకారం మందులు, ఆహార అలవాట్లకు సంబంధించిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఏపీఎ?సఆర్టీసీ రికార్డుల ప్రకారం 45 ఏళ్లలోపు వయసున్న డ్రైవర్లకు ప్రతి రెండేళ్లకు, అది దాటిన వారికి ఏడాదికి ఒకసారి వైద్య పరీక్షలు జరుగుతున్నాయి. ఇందులో ఎక్కువగా రాత్రుల్లో వాహనం నడిపేవారు, దూర ప్రాంతాలకు వెళ్లే డ్రైవర్లు ఎక్కువగా అనారోగ్యం బారిన పడుతున్నట్లు వెల్లడవుతోంది.

పని ఒత్తిడి.. నిద్రలేమి కారణాలు

డ్రైవర్ల గుండెపోటు మరణాలకు ప్రధానంగా పని ఒత్తిడి, పని వేళలు, నిద్రలేమి, ఆహార అలవాట్లు కారణాలుగా చెబుతున్నారు. ఇందులో మొదటి రెండూ తగ్గాలంటే డ్రైవర్ల నియామకాలను ఆర్టీసీ చేపట్టాలి. నిద్రలేమి, ఆహార అలవాట్లు పూర్తిగా డ్రైవర్ల చేతిలోనే ఉన్నాయి. ఏటా వందల మంది డ్రైవర్లు ఎందుకు గుండెపోటుతో మరణిస్తున్నారంటే.. ఆ నాలుగింటినీ జయించడం అటు ఆర్టీసీ యాజమాన్యానికి, ఇటు డ్రైవర్లకు కష్ట సాధ్యంగా మారింది. ఏ సంస్థ అయినా మనుగడ సాగించాలంటే ఆదాయమే అన్నింటికన్నా ముఖ్యం. ప్రతి రోజూ లక్షలాది మంది ప్రయాణికుల్ని గమ్యం చేరుస్తున్న ఆర్టీసీలో ఆక్యుపెన్సీ రేషియో ఆధారంగానే నిర్ణయాలు ఉంటాయి. ఆర్టీసీ డ్రైవర్లకు ప్రైవేటు రవాణాతో పోలిస్తే ఎక్కువ జీతాలు ఉన్నందున పని గంటలు కూడా పెంచాలని, అలా చేయకపోతే సంస్థ మనుగడ కష్టమని ఉన్నతాధికారులు చెబుతున్నారు. 'జీతాలు ఎక్కువ తీసుకొంటూ తక్కువ సమయం పనిచేస్తే సంస్థ మనుగడ కోసం ప్రయాణికులపై చార్జీల భారం వెయ్యాలి. ప్రైవేటు పోటీతోపాటు, ద్విచక్ర వాహనాలు వినియోగించే వారి సంఖ్య పెరిగింది. ఈ పరిస్థితుల్లో ప్రయాణ చార్జీలు పెంచితే ఆక్యుపెన్సీ తగ్గిపోయి ఆర్టీసీ ఉనికికే ప్రమాదం ఏర్పడుతుంది' అని ఒక ఉన్నతాధికారి వివరించారు. 'ఆర్టీసీ బస్సు నడిపే డ్రైవరు.. ఆదాయం తీసుకొచ్చే కండక్టరు.. బస్సు ఆరోగ్యాన్ని పరిరక్షించే మెకానిక్.. రవాణ సంస్థ మనుగడలో ముందుంటారు. వారే పని ఒత్తిడితో ప్రాణాలు కోల్పోతుంటే సంస్థ బాగుంటుందా? ఆ కార్మికుడి కుటుంబం బాగుంటుందా? పెద్ద పెద్ద బస్టాండ్లలోనైనా రెస్ట్ రూమ్‌లు బాగున్నాయా? పది పన్నెండు గంటలపాటు డ్యూటీ చేస్తున్న కార్మికుడిపై మరింత పని భారం మోపితే సమస్యకు పరిష్కారం లభించదు. తగినంత పని, తగినంత విశ్రాంతి ఇస్తే డ్రైవర్ ఆరోగ్యంతోపాటు ఆర్టీసీ మనుగడ కూడా బాగుంటుంది. కొత్త బస్సులు కొనుగోలు చేసి రిక్రూట్మెంట్లు చేపడితే ఆక్యుపెన్సీ పెరిగి సంస్థ ఇంకా బాగుంటుంది' అని ఉద్యోగ సంఘాల నేతలు అంటున్నారు.



కాలం చెల్లిన బస్సులు.. వయసు మళ్లిన డ్రైవర్లు

ఆర్టీసీ ప్రధాన నినాదమైన సురక్షిత ప్రయాణానికి.. బస్సు కండీషన్, డ్రైవర్ ఆరోగ్యం కీలకం. సంస్థలో ఇప్పుడు ఈ రెండూ బాగాలేవు. కాలం చెల్లిన బస్సులు సగానికి పైగా ఉంటే వయసు మళ్లిన డ్రైవర్లు అంతకన్నా ఎక్కువగా ఉన్నారు. ఆర్టీసీలో సొంత బస్సులు 8 వేలు ఉండగా.. వాటిలో 5 వేల బస్సులు కాలం చెల్లినవే. డ్రైవర్ల వయసు సరాసరి 50 ఏళ్లు దాటింది. ప్రజారవాణా మార్గదర్శకాల మేరకు సగటు వయసు 37–39 ఏళ్ల మధ్య ఉండాలి. 2011 తర్వాత డ్రైవర్ల రిక్రూట్మెంట్లు లేవు. ఈ ఏడాది 2600మంది పదవీ విరమణలో ఉండగా, 2030 నాటికి 7 వేల మందికిపైగా పదవీ విరమణ చేయనున్నారు. సొంత బస్సులు 8,250 ఉండగా అందులో 15 లక్షల కిలోమీటర్లు దాటినవి 2,900 ఉన్నాయి. కేంద్ర రవాణా శాఖ మార్గదర్శకాల మేరకు 15 లక్షల కిలోమీటర్ల లోపే రవాణా వాహనాలను తిప్పడం ఆపేయాలి. ఆర్టీసీలో 12లక్షల కిలోమీటర్లు దాటితే పక్కన పెట్టేసే పద్ధతి ఒకప్పుడు ఉండేది. ఇప్పుడున్న బస్సుల్లో 5 వేలకు పైగా 12 లక్షల కిలోమీటర్లు దాటి తిరిగినవే. ఓ అసోసియేషన్ ప్రతినిధి మాట్లాడుతూ 'వెహికల్ యుటిలైజేషన్ ప్రకారం గతంలో 350 కిలోమీటర్లు తిరిగితే రెండు డ్యూటీల కింద లెక్క. ఇప్పుడు 500కు పెంచారు. కాణిపాకం నుంచి తిరుపతికి గతంలో నాలుగు ట్రిప్పులు తిరిగేవి.. ఇప్పుడు ఐదు ట్రిప్పులు తిరగమంటున్నారు. అడిగితే అప్పుడు రోడ్లు బాగలేవు.. ఇప్పుడు బాగున్నాయి కదా అంటున్నారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 7వరకూ తిప్పే డ్రైవరుకు మరో గంట పెంచితే రోజుకు 14 గంటల డ్యూటీ చేసినట్లు.. ఇలా పని భారం పెరిగితే రిటైర్మెంట్ వరకూ అయినా బతుకుతామా?' అని వాపోయారు.

మానసిక ఒత్తిడి ప్రధాన సమస్య: ఎంప్లాయీస్ అసోసియేషన్

ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదర్‌రావు మాట్లాడుతూ.. దీర్ఘకాలిక పనిగంటలతోపాటు మానసిక ఒత్తిడి కూడా గుండె జబ్బులకు ప్రధాన కారణంగా చెబుతున్నారు. 'దూర ప్రాంత డ్రైవరుకు తగినంత విశ్రాంతి లభించడం లేదు. అంతర్రాష్ట్ర సర్వీసులు, పల్లె వెలుగుల్లో స్త్రీ శక్తి రద్దీకి అనుగుణంగా బస్సుల కండీషన్ లేదు. కొత్త బస్సులు కొనకుండా, డ్రైవర్ల సంఖ్య పెంచకుండా ఉన్న బస్సులతోనే నడిపించడం. మైలేజీ రాలేదని అడగటం. బస్సుకు చిన్న డ్యామేజీ జరిగినా డ్రైవర్ జీతం నుంచి కట్ చేయడం' కారణాలుగా పేర్కొన్నారు.ఆహార అలవాట్లే: అధికారులు

ఉన్నతాధికారులు మాత్రం 'ప్రజలకు ఆర్టీసీ 24గంటలు, 365రోజులు సేవలు అందించాల్సిందే. ఇది తెలిసే డ్రైవర్లు ఉద్యోగంలో చేరారు కదా. పని ఒత్తిడి అందరికీ ఉంటుంది. చాలామంది అదనపు డ్యూటీలు చేసి తగిన వేతనం తీసుకొంటున్నారు. ఆరోగ్య సమస్యలకు ప్రధాన కారణం ఆహార అలవాట్లు. దూర ప్రాంత బస్సు డ్రైవర్లు ఎక్కడ పడితే అక్కడ నాణ్యత లేని ఆహారం తింటుంటారు. సమయ పాలన కూడా కుదరకపోవచ్చు. యాజమాన్యం క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయిస్తోంది. డ్రైవర్లు ఆరోగ్యాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలి' అని చెబుతున్నారు.

## రోడ్డు ప్రమాదం బాధితులకు ఆర్థిక సాయం అందజేత వైసీపీ ఇంచార్జి బుర్రా



**క్రైం కౌంటర్ ప్రతినిధి ఉలవపాడు ,** మండలంలోని అలాగాయపాలెం కు చెందిన ముగ్గురుకుఇటీవల రోడ్డు ప్రమాదం జరిగిన వారికి ఆర్థిక సహాయం చేసి మాజీ శాసన సభ్యులు కందుకూరు నియోజకవర్గం వైస్సార్సీపీ ఇంచార్జ్ బుర్రా మధుసూదన్ యాదవ్ ధైర్యం చెప్పారు.ఆ యన వెంట ఉలవపాడు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైద్య శిబిరాలు




**లింగసముద్రం క్రైశీ కౌంటర్ ప్రతినిధి,**మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని లింగసముద్రం లోని తిరుమనశెట్టి కోటయ్య , మొగిలిచర్లలోని శ్రీ దత్తాత్రేయ స్వామి ఆలయములువద్ద ప్రత్యేక వైద్య శిబిరాలు ఆదివారం జరిగాయి.

ఈ వైద్య శిబిరాలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో పి హెచ్ సి వైద్య అధికారి పర్యవేక్షణలో ని భక్తులకు అవసరమైన ప్రథమ చికిత్స, అత్యవసర వైద్య సేవలు, రక్తపోటు, రక్తంలో చక్కెర పరీక్షలు సాధారణ ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు .మందులు, ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు ,అత్యవసర ఔషధాలు ఏర్పాటు చేశారు.డ్యూటీ చార్ట్ ప్రకారం ఎమ్ ఎల్ హెచ్ పి, ఏఎన్ఎం, ఎం పి హెచ్ ఎఇతర సిబ్బంది సేవలను అందించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా వైద్య సదుపాయాలను చేపట్టారు.వైద్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరాలను భక్తులు అభినందించారు.

## భక్తులకు అల్పాహారం

### పూర్వ విద్యార్థులు సేవలు భేష్



**లింగసముద్రం క్రైం కౌంటర్ ప్రతినిధి,మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా లింగసముద్రం** లోని తిరుమనిశెట్టి కోటయ్య మందిరాన్ని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు 8 సంవత్సరాల నుండి నిర్విరామంగా పూర్వ విద్యార్థులు అల్పాహార పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. స్థానిక కమ్మిశెట్టి రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని (1997-2002) పూర్వ విద్యార్థులు భక్తులకు పులిహోర,పెరుగన్నం, మజ్జిగ అందజేశారు.ఈ కార్యక్రమాన్ని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు పూరిమిట్ల గురునాథం, జనసేన పార్టీ మండల అధ్యక్షులు అంగులూరి నరసింహారావు, బిజెపి మండల అధ్యక్షులు మట్టిలో ఏడుకొండలు,ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉమ్మడిశెట్టి మాధవరావు, ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ నిర్విరామంగా పూర్వ విద్యార్థులు శివరాత్రి సందర్భంగా వచ్చే భక్తుల కొరకు అల్పాహార పంపిణీ చేయడం అభినందనీయమని అన్నారు. ఇలాగే ఈ కార్యక్రమాన్ని కొనసాగించాలని వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థి కందుకూరు నియోజకవర్గం జనసేన పార్టీ కోఆర్డినేటర్ బింకం నరేంద్ర, పూర్వ విద్యార్థులు చప్పిడి కొండలరావు, సంగా సురేష్ మునగల రాజశేఖర్, పున్నపు నరేష్, కన్నెపల్లి సురేష్, నున్న అనురాధ, ఏవీఎస్ లక్ష్మి, అన్నంగి రజిన , సుంకరి నర్మద, తదితరులు పాల్గొన్నారు.

## సందడి చేసిన యాంకర్ సుమ కనకాల



**క్రైం కౌంటర్ ప్రతినిధి కంచర్ల మల్లికార్జున రావు నియోజకవర్గ ఇన్చార్జి కందుకూరు,**ఇటీవల నూతనంగా ప్రారంభించిన పట్టణంలోనికోవూరు రోడ్డు లో ఉన్న అన్నంగి సిల్క్స్ , సుమ స్నేహితురాలైనహా అన్నంగి సుజాతహా ఆహ్వానం మేరకు కందుకూరుకు ఆదివారం వచ్చారు. ఈ సందర్భంగా ఆమెఅన్నంగి సిల్క్స్ షాపింగ్ మాల్ లో సందడి చేశారు.

## అమరలింగేశ్వరుడికి ఎమ్మెల్యే ఇంటూరి పూజలు



**ఉలవపాడు క్రైశీకౌంటర్ ప్రతినిధి,**మహాశివరాత్రి సందర్భంగా మండలం లోని మన్నేటికోట లోని శ్రీ అమర లింగేశ్వర స్వామిని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆదివారం దర్శించుకున్నారు. స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు, అధికారులు ఆయన కు స్వాగతం పలికి, పూజల అనంతరం తీర్థ ప్రసాదాలను అందజేశారు. స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చూడాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట సర్పంచ్ బసవయ్య నాయుడు, పలువురు టీడీపీ నేతలు ఉన్నారు.

## విజేతలకు ట్రోఫీ అందజేసిన ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి



**కావలి కంచర్ల మల్లికార్జున రావు క్రైం కౌంటర్ ప్రతినిధి,**స్నేహితుల జ్ఞాపకార్థం క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం గొప్ప విషయమని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి అన్నారు. పట్టణములోని జడ్పీ ఉన్నత పాఠశాల గ్రౌండ్‌లో ఆదివారం నిర్వహించిన ఏఏబీ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. ఉత్కంఠభరితంగా సాగిన తుది పోరులో కావలి ఎఫ్ సీసీ జట్టుపై నెల్లూరు కేసీసీ జట్టు విజయం సాధించి ట్రోఫీని కైవసం చేసుకుంది. ఫైనల్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై విజేతలకు ట్రోఫీలు, నగదు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా విన్నర్, రన్నర్‌తో పాటు మూడవ, నాలుగవ స్థానాల్లో నిలిచిన జట్లకు బహుమతులు ప్రదానం చేశారు. బెస్ట్ బ్యాట్స్‌మన్, బెస్ట్ బౌలర్, ప్లేయర్ ఆఫ్ ది టోర్నీ వంటి వ్యక్తిగత ప్రతిభా పురస్కారాలను అందజేసి ఆటగాళ్లను అభినందించారు. టోర్నమెంట్ ప్రారంభం నుంచి ఫైనల్ వరకు క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తూ సహాయ సహకారాలు అందించిన ఆయనకు నిర్వాహకులు ప్రత్యేకంగా కృతజ్ఞతలను తెలిపారు. క్రీడల ద్వారా యువతలో ఐక్యత, క్రమశిక్షణ పెరుగుతాయని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ యువత క్రీడలపై ఆసక్తి పెంచుకుని ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని సూచించారు. ఇలాంటి క్రీడా కార్యక్రమాలకు ఎప్పుడూ తన పూర్తి మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు.

## మార్కాపురం అర్బన్: రేపు 'ప్రజా సమస్యల వేదిక' (పిజిఆర్ఎస్) రద్దు




**క్రైమ్ కౌంటర్ న్యూస్..... మార్కాపురం జిల్లా.....**మార్కాపురం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే 'ప్రజా సమస్యల వేదిక' (పిజిఆర్ఎస్) కార్యక్రమాన్ని ఈ వారం తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు జిల్లా యంత్రాంగం ప్రకటించింది. జిల్లాలోని అధికారులు ప్రస్తుతం మహాశివరాత్రి పండుగ ఏర్పాట్లలో నిమగ్నమై ఉండటం, అలాగే సోమవారం ఐచ్ఛిక సెలవు కావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. దూర ప్రాంతాల నుండి తమ సమస్యల పరిష్కారం కోసం ఎస్పీ కార్యాలయానికి రావాల్సిన అర్జీదారులు ఈ మార్పును గమనించి అనవసర ప్రయాణం చేయకుండా సహకరించాలని అధికారులు విన్నవించారు.....

## వైఎస్ఆర్సిపి నాయకుడు రామల సింగారెడ్డికు పరామర్శ



**క్రైం కౌంటర్ ప్రతినిధి ఉలవపాడు,** మండల ఉలవపాడులో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో రోడ్డు ప్రమాదం జరిగి ఇంటి వద్ద వున్న మండల వైస్సార్సీపీ సీనియర్ నాయకుడు రామల సింగారెడ్డినుఇంటికి వెళ్లి మాజీ శాసనసభ్యులు కందుకూరు నియోజకవర్గం వైస్సార్సీపీ ఇంచార్జ్ బుర్రా మధుసూదన్ యాదవ్ ఆదివారం పరామర్శించారు.ఆయన వెంట ఉలవపాడు మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పట్టు రైతుకు లాభాల గూళ్లు




**క్రైం కౌంటర్ న్యూస్ :** అమరావతి, ఫిబ్రవరి 15రాష్ట్రంలో పట్టు గూళ్ల (కొకూన్) ధరలు భారీగా పెరిగాయి. సగటు ధర కూడా గణనీయంగా పెరిగింది. రాష్ట్రంలోని అన్ని పట్టు గూళ్ల మార్కెట్లలో 2వారాల నుంచి కిలో కొకూన్ గరిష్ఠ ధర రూ.959 ఉండగా, సగటు ధర రూ.812 నుంచి రూ.848కి చేరింది. కర్ణాటకలోని రాంనగర్ మార్కెట్‌లో గరిష్ఠ ధర రూ.1,000 ఉండగా, సగటు ధర రూ.798 నుంచి రూ.824కు చేరింది. గత పక్షం రోజుల్లో కర్ణాటకలో కన్నా ఏపీలో సగటు ధర ఎక్కువగా ఉంది. కర్ణాటకలో గరిష్ఠ ధరతో పరిమితంగానే క్రయవిక్రయాలు జరిగినట్లు సమాచారం. కానీ ఏపీలో ధర పెరుగుదల కారణంగా ఎక్కువ మంది పట్టు రైతులకు లబ్ధి చేకూరిందని చెప్తున్నారు. సగటు ధరను అంచనా వేసినప్పుడు రాష్ట్రంలోని పట్టు రైతులు పోటీతత్వ, లాభదాయక ధరలు పొందుతున్నారని పట్టు పరిశ్రమ శాఖ డైరెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. గతేడాది రూ.700 పలికిన కొకూన్.. ప్రస్తుతం రూ.959కు చేరింది. మరికొద్ది రోజుల్లో రూ.1,000దాటే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. సంప్రదాయంగా పట్టు ఉత్పత్తి చేసే రాష్ట్రాల్లో ఏపీ రెండో అతి పెద్దది. రాష్ట్రంలో 1.52 లక్షల ఎకరాల్లో పట్టు సాగవుతోంది. 2025-26లో పట్టు ప?థకాల కింద 90% రాయితీతో ఎస్సీ, ఎస్టీ రైతులకు రూ.4.90 కోట్లు కూటమి ప్రభుత్వం ఖర్చు చేసింది. ఇటీవల పట్టు రైతులకు బకాయిలు కూడా చెల్లించింది. 2026-27 బడ్జెట్‌లో పట్టు పరిశ్రమకు 95.87 కోట్లు ప్రతిపాదించింది.

## భద్రత ఏర్పాట్లు పరిశీలించిన ఎస్పీ హర్షవర్ధన్ రాజు



**క్రైమ్ కౌంటర్ న్యూస్ ....ఉమ్మడి ప్రకాశం జిల్లా....** ఉమ్మడి ప్రకాశం జిల్లాలో శివరాత్రి సందర్భంగా దేవాలయాల వద్ద ఏర్పాటు చేసిన భద్రతా ఏర్పాట్లను ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదివారం పరిశీలించారు. మార్కాపురం జిల్లా త్రిపురాంతకం మండలంలోని బాల త్రిపుర సుందరి దేవి ఆలయాన్ని సందర్శించి, పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఆలయాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు...



**క్రైమ్ కౌంటర్ న్యూస్...మార్కాపురం జిల్లా....** మార్కాపురం పట్టణం గుండికనది తీరంలో వెలసిన శ్రీ గంగ సమేత చెంద్రమౌళీశ్వర స్వామి వారిని దర్శించుకుని స్వామి వారి తీర్ధ ప్రసాదములు స్వీకకరించిన ఏపీఐఐసి మాజీ చైర్మన్ నెల్లూరు పార్లమెంట్ వైస్సార్సీపీ పరిశీలకులు మార్కాపురం మాజీ ఎమ్మెల్యే శ్రీ జంకె వెంకటరెడ్డి .....

## అనుకూల తీర్పు రావాలంటే..హైకోర్టు జడ్జికి 50 లక్షలు ఇవ్వాలి..!



**క్రైం కౌంటర్ న్యూస్ :** చెన్నై, ఫిబ్రవరి 15 తమకు అనుకూలంగా తీర్పు వెలువరించేందుకు మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తికి ఇవ్వాలని ఓ సీనియర్ న్యాయవాది.. పిటిషనర్ వద్ద రూ.50 లక్షలు తీసుకున్నాడంటూ కేంద్ర న్యాయశాఖకు అందిన ఫిర్యాదు న్యాయవర్గాల్లో కలకలం రేపుతోంది. ఆ ఫిర్యాదును కేంద్ర న్యాయశాఖ మద్రాసు హైకోర్టుకు పంపగా... దీన్ని సదరు న్యాయవాది తీవ్రంగా ఖండించారు. ఎలాంటి విచారణకైనా సిద్ధమేనని ప్రకటించారు. ఈ ఆరోపణల నేపథ్యంలో సదరు కేసు విచారణ నుంచి తప్పుకొన్న న్యాయమూర్తి.. ఈ మొత్తం వ్యవహారంపై దర్యాప్తు చేపట్టాలని రిజిస్ట్రీని ఆదేశించారు. తమిళనాడులో ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఉదంతం వివరాలిలా వున్నాయి... 2008-09లో ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో పాల్గొంటూ ఇండియన్ మెటల్స్ అండ్ మినరల్స్ ట్రేడింగ్ కార్పొరేషన్‌ను రూ.113.38 కోట్ల మేర మోసం చేశారనే ఆరోపణలపై నరేశ్ ప్రసాద్ అగర్వాల్, గణేశ్ అగర్వాల్‌లపై సీబీఐ కేసు నమోదు చేసింది. వివిధ పరిణామాల అనంతరం ఈ వ్యవహారంపై విచారణ... మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎం.నిర్మల్‌కుమార్ ముందుకు వచ్చింది. ఈ కేసులో అనుకూలమైన తీర్పు రావాలంటే న్యాయమూర్తికి రూ.50 లక్షలు ఇవ్వాలంటూ పిటిషనర్ల నుంచి సీనియర్ న్యాయవాది మురళీకుమరన్ తీసుకున్నారని 'ఆలిండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్' నుంచి కేంద్ర న్యాయశాఖకు ఫిర్యాదు అందింది. ఈ ఫిర్యాదును కేంద్ర న్యాయశాఖ మద్రాసు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి పంపింది. ఈ నేపథ్యంలో ఇటీవల ఈ పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఈ వ్యవహారం న్యాయమూర్తి దృష్టికి వచ్చింది. దీనిపై న్యాయమూర్తి సీనియర్ న్యాయవాది మురళీకుమరన్‌ను ప్రశ్నించగా.. ఆయన ఈ ఆరోపణలు ఖండించారు. ఈ వ్యవహారంలో తాను ఎలాంటి విచారణను ఎదుర్కొనేందుకైనా సిద్ధమని ప్రకటించారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.శ్రీనివాసన్ స్పందిస్తూ.. న్యాయమూర్తిపై నిరాధార ఆరోపణలు చేసినవారిపై చర్యలు తీసుకోవాలని, న్యాయవ్యవస్థ గౌరవానికిభంగం కలిగించే అలాంటి లేఖను తిరస్కరించాలని అభ్యర్థించారు.జస్టిస్ నిర్మల్‌కుమార్ స్పందిస్తూ ఈ వ్యవహారంలో పిటిషనర్ నుంచి న్యాయవాది నగదు తీసుకున్నారో లేదో తేల్చేందుకు విచారణ చేపట్టాలని రిజిస్ట్రీని ఆదేశించారు. అంతేగాక ఈ పిటిషన్‌పై విచారణను మరో బెంచ్‌కి బదిలీ చేసేందుకు అనువుగా ప్రధాన న్యాయమూర్తి ముందుంచాలని ఆదేశించారు.

# కార్యకర్త కష్టాన్ని గుర్తిద్దాం

**పార్టీకి లక్షల మెదళ్లను కదిలించేవాళ్లు కావాలి**
**జనసేన పార్టీ భావజాలం చాలా బలమైనది**
**అందుకే తమిళనాడు, కర్ణాటక నుంచి ఆహ్వానం**
**జనసేన రాష్ట్రానికో, ప్రాంతానికో పరిమితం కాదు**
**యువశక్తి అనే ఇంధనం మీదే పార్టీ నడుస్తోంది**
**పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు ప్రారంభం**
**రూ.2 కోట్లు విరాళం అందించిన అధినేత పవన్**



**క్రైం కౌంటర్ న్యూస్ :** అమరావతి, ఫిబ్రవరి 15 'పార్టీలో నాయకుడిగా ఎదగాలనుకొనేవారు క్షేత్రస్థాయిలో పనిచేసే కార్యకర్త కష్టాన్ని గుర్తించాలి. పార్టీ ఉన్నతి కోసం ఉద్యమి, సాధక్, ప్రదాతగా మారి పనిచేయాలి. అప్పుడే వారు సంపూర్ణ నాయకులుగా ఎదుగుతారు' అని డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. మహా శివరాత్రి సందర్భంగా ఆదివారం ఉదయం మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. పార్టీ తొలి సభ్యత్వం తీసుకున్న ఆయన కార్యకర్తల బీమా కోసం రూ.2 కోట్ల విరాళం చెక్కును పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్, మంత్రి మనోహర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ జనసేన ఐదో విడత కిృయాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 26 నుంచి మొదలవుతుందని, పిఠాపురం నియోజకవర్గంలో మాత్రం ఒకవారం ముందు నుంచే ప్రారంభమవుతుందని పవన్ తెలిపారు. 'ఏ వ్యవస్థ అయినా మనుగడ సాధించాలంటే నిబద్ధత, నిజాయతీ కలిగిన నాయకత్వం చాలా అవసరం. జనసేన పార్టీకి వందలు, వేల మంది అవసరం లేదు. లక్షల మెదళ్లను కదిలించే వాళ్లు కావాలి. అలాంటివాళ్లు పదిమంది ఉన్నా ఈ సమాజంలో మార్పు తీసుకురావచ్చు. జనసేన పార్టీ భావజాలం చాలా బలమైనది. 21వ శతాబ్దానికి ఇది రైట్ ఐడియాలజీ. ఈరోజు మనల్ని తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్రకు ఆహ్వానించడానికి కారణం మన భావజాలమే. ప్రజాస్వామ్య, రాజ్యాంగ విలువలను కాపాడేవారికి సముచిత స్థానం కల్పించాలి. ఇందులో కులం, మతం, ప్రాంతాలను పక్కనపెట్టాలి. పార్టీ భావజాలాన్ని లోతుగా అర్థం చేసుకుని, పార్టీ సిద్ధాంతాలు, ఆశయాలు, ఆకాంక్షలకు అనుగుణంగా పని చేసేందుకు ముందుకొచ్చి పార్టీ సభ్యత్వం తీసుకునే వారిని ఉద్యమిగా పిలుస్తాం. జనసైనికుడికి, పార్టీ నాయకులకు మధ్య సమన్వయకర్తగా, పార్టీ పోరాటానికి మరింత బలాన్ని అందించి, కొత్త రక్తాన్ని తీసుకొచ్చి, సభ్యత్వ నమోదు చేయించే వారిని సాధక్‌గా, జనసేన చేస్తున్న ప్రజా, రాజకీయ పోరాటానికి పరోక్షంగా తమ వంతు సమయాన్ని, ఆర్థిక, సాంకేతిక, సేవా, మేధో సహాయ సహకారాలు అందిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేసేవారిని ప్రదాతగా వ్యవహరిస్తాం' అని పవన్ పేర్కొన్నారు. ఇకనుంచి పార్టీ క్రియాశీలక సభ్యత్వాన్ని ఉద్యమి మెంబర్ షిప్‌గా ప్రకటిస్తున్నామని తెలిపారు.

ఒక ప్రాంతానికి పరిమితమవ్వం

'మొన్న జరిగిన తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో నేను వెళ్లి ప్రచారం చేయకపోయినా, ఎన్నికల్లో పార్టీ నిలబడాలి, మన గళం తెలంగాణలో వినిపించాలనే ఆకాంక్షతో పోటీ చేసిన రెండు స్థానాల్లో గెలుపొందారు. అది చిన్న గెలుపే కావచ్చు.. కానీ అది మార్పునకు బలమైన సంకేతం. జనసేన పార్టీ ఒక రాష్ట్రానికో, ఒక ప్రాంతానికో పరిమితం కాదు. పార్టీకి ఆయువు పట్టు యవత. వాళ్ల శక్తి అనే ఇంధనం మీదే పార్టీ నడుస్తోంది. బాధ్యతయుతమైన యువతను నాయకత్వం వైపు తీసుకెళ్లమే లక్ష్యం" అని పవన్ తెలిపారు. ఈ సందర్భంగా గత ఏడాది అత్యధిక సభ్యత్వాలు చేసిన వారి సమక్షంలో ఆదివారం ఉదయం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. వారితో పవన్ కాసేపు సరదాగా గడిపారు. ఆప్యాయంగా పేరుపేరునా యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వారికి స్వయంగా అల్పాహారం వడ్డించారు. కార్యక్రమంలో జనసేన ఎమ్మెల్సీ హరిప్రసాద్, పార్టీ ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరి, పార్టీ కార్యక్రమాల నిర్వహణ కమిటీ చైర్మన్ కల్యాణం శివశ్రీనివాస్ పాల్గొన్నారు.

# కేంద్రం పరిశీలనకు బీసీ బిల్లు!

**రక్షణ చట్టం హామీ అమలుకు కూటమి ప్రయత్నం**
**జాతీయ బీసీ కమిషన్ పరిశీలన అనంతరం సభలోకి**
**ఉమ్మడి జాబితాలోని అంశం కావడంతో పరిశీలనకు బిల్లు**
**ఆర్డినెన్స్ ద్వారా లేదా వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో చట్టం**



**క్రైం కౌంటర్ న్యూస్ :** అమరావతి, ఫిబ్రవరి 15 ఎన్నికల హామీ మేరకు బీసీలకు రక్షణ చట్టం తీసుకురావడానికి కూటమి ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. జాతీయ బీసీ కమిషన్ పరిశీలనకు పంపిన అనంతరం కేంద్రం అనుమతితో అసెంబ్లీలో ప్రవేశపెట్టాలని భావిస్తోంది. ఎస్సీ, ఎస్టీల తరహాలోనే రాష్ట్రంలో బీసీలకు రక్షణ కల్పించేలా ప్రభుత్వం ప్రతిపాదించిన చట్టానికి బీసీ నేతలు, నిపుణులతో చర్చించి, మంత్రివర్గ ఉపసంఘం నియమించి ముసాయిదా సిద్ధం చేసింది. బీసీలపై దాడులకు పాల్పడితే ఐదేళ్ల వరకు జైలు శిక్ష విధించేలా నిబంధనలు రూపొందించింది. ప్రస్తుతం న్యాయశాఖ పరిశీలనలో ఉన్న ముసాయిదాను అక్కడినుంచి క్యాబినెట్ ముందుకు, ఆ తర్వాత అసెంబ్లీ ఆమోదానికి పంపాలని భావించారు. అయితే న్యాయకోవిదుల సూచనల మేరకు బిల్లును ఢిల్లీలోని జాతీయ బీసీ కమిషన్ పంపి, పరిశీలన అనంతరం అసెంబ్లీలో ప్రవేశపెట్టాలని నిర్ణయించారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా బీసీ రక్షణచట్టం మన రాష్ట్రంలోనే మొదటిసారి తీసుకొస్తుండటంతో ఈ చట్టం రూపకల్పనపై ఉన్న అడ్డంకులను అధిగమించేందుకు మరికొంత సమయం తీసుకోవాలని యోచిస్తున్నారు. దీంతో అసెంబ్లీలో చట్టం చేసేముందు జాతీయ బీసీ కమిషన్‌కు ముసాయిదాను పంపి, వారి సూచనలు, సలహాలతో చట్టం చేయాలని నిర్ణయించారు. తాజా అసెంబ్లీ సమావేశాల్లో పనిదినాలు తక్కువగా ఉ ండటంతో ఈలోపు జాతీయ బీసీ కమిషన్ నుంచి ముసాయిదా పరిశీలన పూర్తయి రావడం కుదరదని భావిస్తున్నారు. దీంతో వచ్చే సమావేశాల్లోనో లేదా ఆర్డినెన్స్ ద్వారానో చట్టం చేసే అవకాశముంది. తాజా అసెంబ్లీ సమావేశాల్లో ఈ బిల్లు ప్రవేశపెట్టే అవకాశం లేదని పేర్కొంటున్నారు. ఈచట్టం శిక్షలకు సంబంధించినది. ఈ అంశం రాజ్యాంగంలో ఉమ్మడి జాబితాలో ఉన్నందున కేంద్రం అనుమతి అవసరం.

ప్రతి జిల్లాలో ప్రత్యేక కోర్టులు


బీసీల రక్షణ చట్టం ముసాయిదాను ఇప్పటికే బీసీ కమిషన్ అధికారులు సిద్ధం చేశారు. బీసీలపై సామాజిక బహిష్కరణ, దాడులు, దూషణలు, వేధింపులు, ఇతర అఘాయిత్యాలకు పాల్పడితే ఆర్నెల్ల నుంచి ఐదేళ్ల వరకు జైలుశిక్ష, జరిమానా విధించనున్నారు. రెండోసారి అదే నేరానికి పాల్పడితే ఏడాది నుంచి రెండేళ్ల వరకు జైలు శిక్ష విధిస్తారు. ఈ శిక్షను న్యాయస్థానం మరింత పెంచే వీలుంది. బీసీలపై వేధింపులకు సంబంధించిన కేసుల్లో ముందస్తు బెయిల్ పొందేందుకు అవకాశం ఉండదు. కేసుల విచారణకు ప్రతి జిల్లాలో ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేసేలా ముసాయిదాలో పేర్కొన్నారు. అవసరమైతే సెషన్స్ కోర్టును ప్రత్యేక న్యాయస్థానంగా నియమించనున్నారు. చార్జిషీట్ దాఖలు నుంచి రెండు నెలల్లోనే కేసు పరిష్కరించే లక్ష్యంగా రూపొందించారు. ప్రత్యేక కోర్టులో న్యాయం జరగలేదని భావిస్తే, తీర్పు వెలువడిన 90 రోజుల్లో బా???ధితులు హైకోర్టును ఆశ్రయించవచ్చు. గరిష్ఠంగా 180 రోజుల వరకు అవకాశం కల్పించారు. బీసీ వ్యక్తులపై అభియోగాలు వచ్చినప్పుడు, ఆ వ్యక్తికి మరణదండన లేదా జీవితఖైదు శిక్షపడేలా ఉద్దేశపూర్వకంగా తప్పుడు సాక్ష్యం సృష్టించిన వారికి జీవితఖైదుతో పాటు జరిమానా విధిస్తారు. చార్జిషీట్ దాఖలు, విచారణ ప్రక్రియలో ఉ ద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం చేసిన ఏ ప్రభుత్వ ఉద్యోగికైనా ఆర్నెల్ల నుంచి గరిష్ఠంగా సంవత్సరం పాటు జైలు శిక్ష, జరిమానా విధిస్తారు. కేసుల విచారణ సందర్భంగా బాధితులు, సాక్షులకు ప్రభుత్వం రక్షణ కలిస్తుంది. ప్రయాణం, పోషణ ఖర్చులు కూడా అందిస్తుందిబీసీ అట్రాసిటీ అంటే.. బీసీలను భయపెట్టడం, బహిరంగంగా అవమానించడం, కులం పేరుతో అవమానకర పదాలు లేదా సంకేతాలతో అవమానించడం, తక్కువ చేయడం. ఆర్థిక వ్యవహారాలు, వ్యాపారాలు, ఉపాధి, సేవలను నిరాకరించడం, సామాజిక బహిష్కరణకు గురిచేయడం, ప్రజాసేవల్లో వివక్ష అంటే.. విద్య, ఆరోగ్యం, ప్రజావనరులు, గృహవసతి కల్పనకు, ప్రభుత్వ ఉద్యోగాలకు కులం ఆధారంగా నిరాకరించడం వంటివి బీసీ అట్రాసిటీగా పేర్కొన్నారు. చట్టబద్ధ అధికారం లేదా పరిహారం లేకుండా నివాసం/భూమి నుంచి బలవంతంగా పంపడం, ప్రభుత్వ సేవలు, పథకాలు అందకుండా అడ్డుకోవడం, దాడి చేయడం లేదా శారీరక గాయం కలిగించడం, లైంగిక వేధింపులు, దాడులు చేయడం, మహిళలపై లైంగిక వేధింపులు, దాడులకు పాల్పడటం, హాని చేసే ఉద్దేశంతో తప్పుడు కేసులు పెట్టడం, భూమి, పంటలు, పశువులు తదితరాలు ఆక్రమించడం, నివాసం, జీవనోపాధి, పంటలు దెబ్బతీయడం, మత సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనకుండా అడ్డుకోవడం కూడా అట్రాసిటీనే. అదేవిధంగా బహిరంగ ప్రదేశాల్లో బీసీలకు అడ్డంకులు సృష్టించడం, రహదారులు, బావులు, ఘాట్లు, శ్మశానాలు, ఆలయాలు వంటి ప్రదేశాల వినియోగాన్ని నిరోధించడం, అక్కడికి ప్రవేశాన్ని అడ్డుకోవడం కూడా నేరంగా భావిస్తారు.

# సినిమా



## ఉదయ్ కిరణ్ భార్య ఇప్పుడు ఎలా ఉందో.? ఏం చేస్తుందో తెలుసా.?

ఎంతోమంది హీరోలు తెలుగులో సినిమాలు చేసి ప్రేక్షకులను మెప్పిస్తున్నారు. యంగ్ హీరోలు కొత్త కొత్త సినిమాలతో రాణిస్తున్నారు. కొంతమంది హీరోలు. అయితే ఒకప్పుడు స్టార్ హీరోలు అవుతారు అనుకున్న వారు ఊహించని ఫ్లాప్ లతో కనిపించకుండా పోయారు. కథల ఎంపికలో తప్పటడుగు వేయడంలోనో.. లేక మరో కారణంతోనో చాలా మంది హీరోల సినిమాలు ఫ్లాప్ అయ్యాయి. ఉదయ్ కిరణ్ కెరీర్ కూడా అలానే జరిగింది. తక్కువ సమయంలో స్టార్ హీరోగా ఎదిగాడు ఉదయ్ కిరణ్. తేజ దర్శకత్వంలో 2000 సంవత్సరంలో వచ్చిన చిత్రం అనే సినిమాతో హీరోగా పరిచయం అయ్యాడు ఈ హీరో. తక్కువ సమయంలోనే స్టార్ డమ్ సొంతం చేసుకున్నాడు ఉదయ్ కిరణ్..తొలి సినిమాతోనే భారీ విజయాన్ని అందుకొని అందరి దృష్టిని ఆకర్షించాడు. ఆ తర్వాత వరుసగా సినిమాలు చేసి ప్రేక్షకులను ఆకట్టుకున్నాడు ఉదయ్ కిరణ్. తేజ దర్శకత్వం వహించిన చిత్రం సినిమా తర్వాత నువ్వు నేను, మనసంతా నువ్వే, కలుసుకోవాలని, శ్రీరామ్, హోలీ, నీ స్నేహం లాంటి సినిమాలతో వరుస విజయాలను అందుకున్నాడు ఉదయ్ కిరణ్. అదే సమయంలో విపరీతమైన ఫ్యాన్ ఫాలోయింగ్ ను సొంతం చేసుకున్నాడు ఉదయ్. అయితే ఊహించని విధంగా ఉదయ్ సినిమాలు వరుసగా ఫ్లాప్ అవుతూ వచ్చాయి. వరుసగా ఫ్లాప్స్ రావడంతో ఉదయ్ కిరణ్ డైలమాలో పడ్డారు. తెలుగులోనే కాదు తమిళ్ లోనూ సినిమా చేసి అదృష్టాన్ని పరీక్షించుకున్నాడు. అక్కడ పోయి అనే సినిమాతో తమిళ్ ఇండస్ట్రీలోకి కూడా అడుగు పెట్టాడు ఉదయ్ కిరణ్.అయితే వరుస ఫ్లాప్ లు రావడంతో ఉదయ్ కిరణ్ కెరీర్ ఆందోళల్లో పడింది. చేసిన సినిమాలన్నీ బాక్సాఫీస్ దగ్గర బోల్తా కొట్టడంతో ఆయనకు అవకాశాలు తగ్గుతూ వచ్చాయి. ఆ తర్వాత ఉదయ్ కిరణ్ విషితను వివాహం చేసుకున్నాడు. ,వీరి వివాహం గ్రాండ్ గా జరిగింది. సినీ సెలబ్రెటీలు కూడా వీరి వివాహానికి హాజరయ్యారు. పెళ్లి తర్వాత ఈ ఇద్దరూ చాలా సంతోషంగా గడిపారు. పెళ్లి తర్వాత ఆయనకు అవకాశాలు తగ్గడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారు ఉదయ్. భార్య జాబ్ చేస్తుండటంతో ఆయన ఇంట్లో ఖాళీగా ఉండే పరిస్థితి ఏర్పడింది. చివరకు ఆయన మనస్తాపంతో ఆత్మహత్య చేసుకొని కన్నుమూశారు. ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు ఉదయ్. ఆయన మరణంతో ఫ్యాన్స్ ఆందోళనకు గురయ్యారు. ఇప్పటికి ఆయన ఫ్యాన్స్ ఉదయ్ ను మిస్ అవుతున్నారు. అయితే ఉదయ్ కిరణ్ భార్య విషిత ఇప్పుడు ఏం చేస్తుందో తెలుసా..? ఆమె ఇప్పుడు ఎక్కడ ఉన్నారు.? ఏం చేస్తున్నారాని కొందరు నెటిజన్స్ ఆరా తీస్తున్నారు. విషిత ఇప్పుడు సాఫ్ట్ వేర్ జాబ్ చేస్తుంది. ఉదయ్ కిరణ్ మరణం తర్వాత ఆమె మరో వివాహం చేసుకోలేదు. జాబ్ చేసుకుంటూ జీవితాన్ని కొనసాగిస్తున్నారు విషిత.





## ఉదయాన్నే ఖాళీ కడుపుతో ఈ నీరు తాగితే శరీరంలో జరిగే అద్భుతాలివే..

మన వంటిల్లే ఒక అద్భుతమైన ఔషధాల గని అని పెద్దలు చెబుతుంటారు. ఆ మాట అక్షర సత్యమని నిరూపించే అతిముఖ్యమైన ద్రవ్యం వెల్లుల్లి నీరు. సాధారణంగా వెల్లుల్లిని కూరలకు రుచి కోసం వాడతాం.. కానీ ప్రతిరోజూ ఉదయాన్నే ఖాళీ కడుపుతో ఒక గ్లాసు వెల్లుల్లి నీటిని తాగితే శరీరంలో ఎలాంటి విప్లవాత్మక మార్పులు వస్తాయో తెలుసా? మీ రోగనిరోధక శక్తిని రెట్టింపు చేయడం నుంచి గుండెను పదిలంగా ఉంచడం వరకు.. ఈ చిన్న అలవాటు ఒక నేచురల్ షీల్డ్‌లా పనిచేస్తుంది. అసలు వెల్లుల్లి నీటిలో ఉన్న ఆ మ్యాజిక్ ఏంటీ..? బరువు తగ్గాలనుకునే వారు, బీపీతో ఇబ్బంది పడేవారు దీనిని ఎందుకు అమృతంలా భావిస్తారు? వంటింటి వైద్యంలోని ఈ అద్భుత రహస్యాలు, వెల్లుల్లి నీటిని పర్‌ఫెక్ట్‌గా ఎలా తయారు చేసుకోవాలో తెలుసుకోవడం చాలా ముఖ్యం.

వెల్లుల్లి నీటితో కలిగే 6 అద్భుత ప్రయోజనాలు

ఇన్ఫెక్షన్ల నుండి రక్షణ

వెల్లుల్లిలో ఉండే అల్లిసిన్ అనే సమ్మేళనం ఒక నేచురల్ యాంటీ బయాటిక్‌లా పనిచేస్తుంది. ఇది శరీర రోగనిరోధక శక్తిని పెంచి వైరస్‌లు, బ్యాక్టీరియా, ఫంగల్ ఇన్ఫెక్షన్ల నుండి మనల్ని రక్షిస్తుంది. తరచుగా జలుబు, దగ్గుతో బాధపడేవారికి ఇది గొప్ప ఉపశమనం.

గుండె పదిలం -- బీపీ నియంత్రణ

రక్తపోటు సమస్యతో బాధపడేవారికి వెల్లుల్లి నీరు ఒక వరప్రసాదం. ఇది రక్త నాళాలను వ్యాకోచింపజేసి, రక్త ప్రసరణను సులభతరం చేస్తుంది. అంతేకాకుండా శరీరంలోని చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి, గుండెపోటు వచ్చే ప్రమాదాన్ని అడ్డుకుంటుంది.వెయిట్ లాస్ -- మెటబాలిజం పెరుగుదల

బరువు తగ్గాలని ప్లాన్ చేస్తున్నారా? అయితే మీ డైట్‌లో వెల్లుల్లి నీటిని చేర్చుకోండి. ఇది శరీరంలోని జీవక్రియను వేగవంతం చేసి, అదనపు కొవ్వును కరిగించడంలో సహాయపడుతుంది.

జీర్ణక్రియ మెరుగుపడుతుంది

కడుపు ఉబ్బరం, గ్యాస్, అజీర్ణం, మలబద్ధకం వంటి సమస్యలకు వెల్లుల్లి నీరు చెక్ పెడుతుంది. ఇది ప్రేగులలోని హానికరమైన వ్యర్థాలను తొలగించి జీర్ణవ్యవస్థను శుభ్రపరుస్తుంది.

దృఢమైన ఎముకలు

వెల్లుల్లిలో కాల్షియం, మాంగనీస్ వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి ఎముకల సాంద్రతను పెంచి, వయసు పెరిగే కొద్దీ వచ్చే ఆస్టియోపోరోసిస్ వంటి సమస్యల నుండి కాపాడుతాయి.

ఊపిరితిత్తుల ఆరోగ్యం


వెల్లుల్లిలోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు శ్వాసనాళాల్లోని వాపును తగ్గిస్తాయి. ఆస్తమా లేదా ఇతర శ్వాసకోస సమస్యలు ఉన్నవారికి ఇది శ్వాస తీసుకోవడాన్ని సులభతరం చేస్తుంది.

వెల్లుల్లి నీటిని ఎలా తయారు చేయాలి?

స్టెప్ 1: రెండు వెల్లుల్లి రెబ్బలను తీసుకుని పొట్టు తీసి, వాటిని కొద్దిగా దంచండి.

స్టెప్ 2: దంచిన వెల్లుల్లిని ఒక గ్లాసు గోరువెచ్చని నీటిలో కలపండి.

స్టెప్ 3: ఒక 5-10 నిమిషాలు అలాగే ఉంచి, ఉదయాన్నే ఖాళీ కడుపుతో ఈ నీటిని త్రాగాలి.



## రోజంతా గోరువెచ్చని నీరు తాగితే ఏమవుతుంది..?

నీరు శరీర దాహాన్ని తీర్చడమే కాకుండా రక్తంలో కలిసిపోయి ప్రతి కణానికి ఆక్సిజన్‌ను సరఫరా చేసే జీవనాధారం. మానవ శరీరం 70 శాతం నీటితోనే నిర్మితమై ఉంటుంది. అయితే ఏ రకమైన నీరు ఎప్పుడు తాగాలి అనే విషయంలో చాలామందికి స్పష్టత ఉండదు. మన పూర్వీకుల నుండి వస్తున్న ఉదయం గోరువెచ్చని నీరు తాగే అలవాటు కేవలం సంప్రదాయం మాత్రమే కాదు అదొక అద్భుతమైన ఆరోగ్య ప్రక్రియ అని ఆయుర్వేదం చెబుతోంది.జీర్ణ అగ్నిని రగిలించే గోరువెచ్చని నీరు

ఆయుర్వేద శాస్త్రం ప్రకారం.. ఉదయాన్నే గోరువెచ్చని నీరు తాగడం వల్ల శరీరంలోని జీర్ణ అగ్ని యాక్టివేట్ అవుతుంది. ఇది శరీరంలోని కఫ దోషాన్ని సమతుల్యం చేయడంలో కీలక పాత్ర పోషిస్తుంది.

గోరువెచ్చని నీటితో కలిగే టాప్ 4 ప్రయోజనాలు:

జీర్ణక్రియ మెరుగు: తిన్న ఆహారం త్వరగా జీర్ణం కావడానికి, మలబద్ధకం సమస్యను వదిలించడానికి ఇది చక్కటి పరిష్కారం.టాక్సిన్స్ తొలగింపు: శరీరం లోపల పేరుకుపోయిన హానికరమైన విష పదార్థాలను బయటకు పంపి, రక్తాన్ని శుద్ధి చేస్తుంది. బరువు తగ్గడం: క్రమం తప్పకుండా వేడి నీటిని తాగడం వల్ల శరీరంలో మెటబాలిజం రేటు పెరిగి, కొవ్వు కరగడానికి సహాయపడుతుంది.

శ్వాసకోశ సమస్యలకు చెక్: గొంతులో పేరుకుపోయిన కఫాన్ని వదులు చేసి, దగ్గు, జలుబు నుండి ఉపశమనాన్ని ఇస్తుంది. అధిక దాహం: విపరీతమైన డీహైడ్రేషన్ ఉన్నప్పుడు గోరువెచ్చని నీరు తాగితే శరీరంలోని తేమ మరింత తగ్గే అవకాశం ఉంది.

## ఏందిరా సామీ ఇది.

అభిషేక్ శర్మ అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యంత దారుణమైన పతనాన్ని ఎదుర్కొంటున్నట్లు కనిపిస్తోంది. ప్రస్తుతం జరుగుతున్న టీ20 ప్రపంచ కప్ దానికి నిదర్శనంగా మారింది. ఖూూతో జరిగిన ప్రారంభ మ్యాచ్‌లో డకౌట్ అయిన అభిషేక్.. ఆదివారం కొలంబోలో చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌తో జరిగిన మ్యాచ్‌లోనూ ఇదే రిపీట్ చేశాడు. కెప్టెన్ సల్మాన్ ఆఘా పాకిస్తాన్ తరపున బౌలింగ్ దాడిని ప్రారంభించడంతో అభిషేక్ పై పాకిస్తాన్ పూర్తి ప్లాన్ తో వచ్చిందని అర్థమైంది. అతను వరుసగా రెండవ మ్యాచ్ లో నాలుగు బంతులు ఆడి డకౌట్ కావడంతో పాకిస్తాన్ ప్లాన్ అద్భుతంగా పనిచేసింది.గత 6 ఇన్నింగ్స్‌లలో అభిషేక్ శర్మకు ఇది 4వ డకౌట్. ఈ క్రమంలో అభిషేక్ శర్మ చాలా అవాంఛిత జాబితాలలోకి ఎంట్రీ ఇచ్చాడు. అలాగే కొన్ని మరపురాని రికార్డులను సాధించడం గమనార్హం.

టీ20 ప్రపంచకప్ లో మొదటి రెండు మ్యాచ్‌లలో డకౌట్ అయిన బ్యాటర్లు..

ఈ అవాంఛిత ఘనత సాధించిన మూడో ఆటగాడిగా అభిషేక్ నిలిచాడు. ఆశిష్ నెహ్రా, బంగ్లాదేశ్ కు చెందిన ఇమ్రుల్ కయేస్ లతో కలిసి అభిషేక్ తమ తొలి రెండు టీ20 ప్రపంచకప్ ఇన్నింగ్స్ లలో డకౌట్ గా ఔటైన బ్యాట్స్ మెన్ గా నిలిచాడు.ఈ భారత స్టార్ టీ20 ప్రపంచ కప్‌లో కేవలం రెండు మ్యాచ్‌లు మాత్రమే ఆడాడు. ఇంకా తన ఖాతా తెరవలేదు. పరుగుల ఖాతా కోసం వేచి చూస్తున్నాడు.

టీ20 ప్రపంచకప్‌లలో భారత్ తరపున అత్యధికంగా డకౌట్ అయిన ప్లేయర్లు..

ఆశిష్ నెహ్రా 3 డకౌట్లతో అగ్రస్థానంలో ఉన్నాడు. అభిషేక్ గౌతమ్ గంభీర్, రవీంద్ర జడేజా, విరాట్ కోహ్లీ, శివం దూబే వంటి వారి జాబితాలో రెండు డకౌట్లతో చేరాడు. ఈ జాబితాలో కూడా నెహ్రా అగ్రస్థానంలో ఉన్నాడు. టీ20 ప్రపంచ కప్‌లలో అత్యధికంగా డకౌట్ అయిన భారతీయుల జాబితాలో అభిషేక్ కొంతమంది స్టార్ పేయర్లతో కలిసి ఈ అవాంఛిత కంపెనీలోకి ప్రవేశించాడు.

టీ20ల్లో భారత్ తరపున ఓపెనర్లుగా అత్యధికంగా డకౌట్ అయిన ఆటగాళ్లు..

టీ20ల్లో ఓపెనర్‌గా రోహిత్ శర్మ 10 డకౌట్లు నమోదు చేయగా, అభిషేక్ శర్మ, సంజు సామ్సన్‌ను అధిగమించి టీ20ల్లో అత్యధిక డకౌట్లు (5) అయిన భారత బ్యాట్స్‌మన్‌గా సంయుక్తంగా రెండవ స్థానంలో నిలిచాడు.

భారత మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ 10 డకౌట్లతో మొదటి స్థానంలో నిలిచాడు. అభిషేక్ మరచిపోయిన ఓపెనర్ కేఎల్ రాహుల్‌తో కలిసి ఇప్పుడు రెండవ స్థానాన్ని ఆక్రమించాడు.




## టీమిండియా ప్లేయింగ్ 11 నుంచి స్టార్ ప్లేయర్ ఔట్..

భారత్ వర్సెస్ పాకిస్తాన్ మధ్య టీ20 ప్రపంచ కప్ 2026 మ్యాచ్ కు కొన్ని గంటల సమయం మాత్రమే ఉంది. కానీ, మ్యాచ్ కు ముందు, భారత శిబిరం నుంచి కీలక వార్తలు వెలువడుతున్నాయి. ఈ మ్యాచ్ లో అర్ష్ దీప్ సింగ్ ఆడదని వార్తలు వినిపిస్తున్నాయి. భారత జట్టు అతని స్థానంలో కుల్దీప్ యాదవ్ కు అవకాశం ఇవ్వబోతోంది. ఇంకా, ప్లేయింగ్ ఎలెవన్ లో మరో మార్పు ఖాయం అని తెలుస్తోంది. సంజు శాంసన్ స్థానంలో అభిషేక్ శర్మ వచ్చాడు. అనారోగ్యం కారణంగా అభిషేక్ మునుపటి మ్యాచ్ కు దూరమయ్యాడు. కానీ, ఇప్పుడు ఫిట్ గా ఉన్నాడు. కానీ ప్రశ్న ఏమిటంటే.. అర్ష్ దీప్ సింగ్ ను ఎందుకు తప్పించారు..? అనే సంగతి తెలియాల్సి వచ్చింది.

అర్ష్‌దీప్ సింగ్ ఔట్.. భారత్, పాకిస్తాన్ జట్ల మధ్య మ్యాచ్ కొలంబోలో జరగనుంది. ఈ మ్యాచ్‌ను కవర్ చేస్తున్న జర్నలిస్టులు ఫాస్ట్ బౌలర్ అర్ష్‌దీప్ సింగ్‌కు ఈ మ్యాచ్‌లో అవకాశం ఇవ్వరని చెబుతున్నారు. కొలంబో స్పిన్ అనుకూల పరిస్థితులను పరిగణనలోకి తీసుకున్న తర్వాత, భారత జట్టు కుల్దీప్ యాదవ్‌కు అవకాశం ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. పాకిస్తాన్‌పై కుల్దీప్ యాదవ్ ప్రదర్శన అద్భుతంగా ఉంది. పాకిస్తాన్‌పై అతను నిలకడగా వికెట్లు పడగొట్టిన సంగతి తెలిసిందే.

పాకిస్థాన్ పై కుల్దీప్ యాదవ్ ప్రదర్శన..

పాకిస్తాన్‌తో జరిగిన 9 మ్యాచ్‌ల్లో కుల్దీప్ యాదవ్ 23 వికెట్లు పడగొట్టాడు. అతను ఒకసారి 5 వికెట్లు, ఒకసారి పాకిస్తాన్‌పై 4 వికెట్లు పడగొట్టాడు. పాకిస్తాన్ బ్యాటర్స్ అతని వైవిధ్యాలను అర్థం చేసుకోవడం కష్టం, ముఖ్యంగా బాబర్ ఆజం అయితే చాలా కష్టపడుతుంటాడు.కొలంబోలో స్పిన్నర్ల ఆధిపత్యం..

ముఖ్యంగా, భారత్-పాకిస్తాన్ మ్యాచ్ జరగనున్న కొలంబోలోని ఆర్. ప్రేమదాస స్టేడియం స్పిన్నర్లకు అనుకూలమైన వేదిక. అయితే, పాకిస్తాన్ ఇంకా ఈ మైదానంలో ఆడలేదు. సింహాలీస్ స్పోర్ట్స్ క్లబ్‌లో జరిగిన మునుపటి మ్యాచ్‌లో పాకిస్తాన్ బౌలర్లు తమ ప్రతిభను ప్రదర్శించారు. ఉస్మాన్ తారిక్ 4 ఓవర్లలో 27 పరుగులకు 3 వికెట్లు పడగొట్టాడు. షాదాబ్ ఖాన్ 2 వికెట్లు పడగొట్టాడు.




Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006. Published by Katikala Vara Prasad. at H.No. 1-94, Nekunampuram, Pokur, Prakasam, Andhra Pradesh - 523113. Editor. Katikala Vara Prasad. RNI- 2015/62250, Reg No: APTEL/25/A2843. Ph:9849707349 email:kvp6858@gmail.com